కొత్త పింఛన్లు ఇంకెప్పుడు?

- సచివాలయాల చుట్టూ వృద్ధులు, వితంతువులు ప్రదక్షిణలు
- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా పట్టించుకోని వైనం
- ఇప్పటికీ ప్రారంభం కాని దరఖాస్తుల ప్రక్రియ
- కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న అర్హులు



నంద్యాల మండలం మిట్నాల సచివాలయం


వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న పీడీ శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఎన్నికల హామీల అమలు ఊసే లేదు. నమ్మి ఓటేసిన ప్రజలు మాత్రం హామీలు అమలు కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. గత కొద్ది నెలలుగా సర్వేల పేరుతో కూటమి సర్కారు ఉన్న పింఛన్లు తొలగించడం తప్ప కొత్తగా ఒక్కరికి కూడా ఇచ్చింది లేదు. కనీసం వృద్ధులు, వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు చేయడం లేదు. అధికారం చేపట్టగానే పింఛన్ మంజూరు చేస్తామని ఎన్నికల ముందు ప్రచారం చేయడంతో అర్హులు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇటీవల స్పౌజ్ కేటగిరీలో పింఛన్ల మంజూరు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే మాత్రమే భార్యకు ఆ పింఛన్‌ను బదిలీ చేస్తున్నారు. పింఛన్ రాని వ్యక్తి చనిపోతే ఆయన భార్యకు మాత్రం మొండిచేయి చూపిస్తున్నారు. వివిధ సామాజిక పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారిని పట్టించుకోవడం లేదు. నంద్యాల జిల్లాలో ప్రస్తుతం 2.14 లక్షల మంది సామాజిక పింఛన్ దారులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ పింఛన్..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ఆరు నెలల్లోనే కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. నేడు కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. ఏకంగా పెన్షన్‌కు సంబంధించి వెబ్‌సైట్ నిలిపివేయడంతో అర్హులు తీవ్ర ఇబ్బదులు పడుతున్నారు. పింఛన్ల మంజూరులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుసరించిన విధానమే సరైందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇంటి వద్దే పింఛన్ అందించేవారు. భర్త చనిపోయిన వారికి వితంతు పింఛన్లు మరుసటి నెలలోనే మంజూరయ్యేది. అలాగే ఏడాదికి రెండుసార్లు వైఎస్సార్‌సీపీ సర్కారు కొత్త పింఛన్లు మంజూరు చేసేది. ప్రస్తుతం ఈ పరిస్థితి లేక పోవడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువ శాతం పింఛన్ మంజూరు చేయమని అర్జీలు అందిస్తున్నారు.

హామీకే పరిమితం

కూటమి సర్కారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారికి 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చింది. ఏడాదైన ఆచరణలో పెట్టలేదు. ఎప్పటి నుంచి అమలు చేస్తుందో కూడా ప్రకటించలేదు. జిల్లాలో అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో మొత్తం 489 పంచాయతీలు,516 సచివాలయాలున్నాయి. ప్రతిరోజూ పదుల సంఖ్యలో వృద్ధులు. వితంతువులు, దివ్యాంగులు మాత్రం కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వస్తున్నారు. ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని వారికి సచివాలయ సిబ్బంది సమాధానం చెబుతుండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి

నా భర్త రాయుడు. గతంలో అనారోగ్యంతో మృతి చెందాడు. గతేడాది కాలంగా వితంతు పింఛన్ మంజూరు కోసం అధికారులు చుట్టూ తిరుగుతున్నాను. నేటికి పింఛన్ మంజూరు కాలేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాను.

– కమలమ్మ, నంద్యాల

దరఖాస్తుకు అవకాశం లేదు

సామాజిక పింఛన్‌దారుడు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగిరీలో పింఛన్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతానికి అవకాశం లేదు. వెబ్‌సైట్ తెరుచుకుంటే అర్హులైన వారు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

–శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అభయ ఆంజనేయ స్వామి ఆలయ ధ్వజ ప్రతిష్ఠ


అభయ అంజనేయస్వామిని దర్శించుకుంటున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని కొండాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీఅభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులంతా పెద్ద సంఖ్యంలో పాల్గొని స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామ సర్పంచి మాధవీలత, వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా కిశోర్‌రెడ్డి, పయిడేల శివరామిరెడ్డి, డీలర్ శివుడు, శివారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో స్వాతి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో శ్రీ గణ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీ గణ మద్దిలేటి లక్ష్మీ నృసింహాస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు ముందుగా స్వామికి పంచామృత అభిషేకం, స్నాపన తిరుమంజన సేవ నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వాతి పల్లకీ సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు మధుసూదన్ నారాయణ, అర్చకుడు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చర్చి వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో పెద్దకంబలూరు చర్చి

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరులో చర్చి వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని క్రైస్తవులు మందిరాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మూడో రోజు ఆదివారం మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అలాగే వృషభ రాజములకు బండ లాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేసి అభినందించారు.

యోగాంధ్ర ర్యాలీని జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 9వ తేదీన నంద్యాల మున్సిపల్ కార్యాలయం నుంచి పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియం వరకు జరిగే యోగాంధ్రలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని ఇన్‌చార్జ్ కమిషనర్ వెంకటదాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ, చైర్ పర్సన్ మాబున్నిసా, కౌన్సిలర్లు, జిల్లా అధికారులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

పెద్దమ్మదేవరకు భారీ బందోబస్తు


ఆలయ పరిసరాలను డ్రోన్ ద్వారా వీక్షిస్తున్న డీఎస్పీ ప్రమోద్

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె పెద్దమ్మ దేవర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పెద్దమ్మ దేవర ఉత్సవాలను తిలకించారు. డీఎస్పీ ప్రమోద్ మాట్లాడుతూ దేవరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్ స్థలాల కేటాయింపు వంటివాటిపై దృష్టి సారించినట్లు చెప్పారు. భక్తులు ప్రశాంతంగా అమ్మవారి దర్శనం చేసుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

సూర్యాలయంలో సినీ హీరో ఆకాష్ పూజలు

కర్నూలు కల్చరల్: ప్రముఖ సినీ దర్శకుడు పూరీ జగన్నాథ్ తనయుడు సినీ హీరో ఆకాష్ పూరి ఆదివారం కర్నూలు నగరంలో సందడి చేశారు. శ్రీ సూర్య నారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. సూర్య భగవానుడికి విశేష పూజలు, అభిషేకం, అర్చనలు జరిపించారు. దేవాలయంలోని దేవతలను దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



శిరివెళ్ల: నంద్యాల–ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై యర్రగుంట్ల విమలా పాఠశాల మలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు (65) మృతి చెందాడు. ఇతను రోడ్డు దాటుతుండంగా గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడి కక్కడే చనిపోయాడు. మృతుడు తెల్లని షర్టు, దోవతి ధరించి ఉన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపారు.

తైక్వాండో పోటీల్లో సత్తా చాటండి


క్రీడాకారులను అభినందిస్తున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి

కర్నూలు (టౌన్): అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నగరూరు శమంతకమణి సూచించారు. జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్స్ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన 45 మంది క్రీడాకారులను ఆమె ఆదివారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో తైక్వాండో క్రీడాంశంలో విద్యార్థినీ, విద్యార్థులు చక్కగా రాణిస్తున్నారన్నారు. తైక్వాండో ఇన్‌చార్జ్ సతీష్‌కుమార్, రాయలసీమ ఫిట్‌నెస్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ అధ్యక్షురాలు సోమేశ్వరి, మాస్టర్లు వీరేష్ బాబు, శివన్న, కామర్తి, భరత్ పాల్గొన్నారు.



పెద్దమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దేవీ.. దీవించు

దొర్నిపాడు: ఆదిశక్తి.. పరాశక్తి .. లోక మాతవు నీవే అంటూ భక్తులు మూల పెద్దమ్మను కొనియాడుతూ భక్తి శక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. డబ్ల్యూ గోవిందిన్నె పెద్దమ్మ దేవర ఉత్సవాలను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. తొలిరోజు అమ్మవారిని నూతన పట్టువస్త్రాలతో అలంకరించి దేవి ఉత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని చల్లగా చూడాలని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా కిశోర్‌రెడ్డి, భూమా చెంచిరెడ్డి, భూమా వీరభద్రారెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

మహానందిలో భక్తుల సందడి


మహానంది కోనేరులో భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి,మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు


విలేకరులతో మాట్లాడుతున్న భూమా కిశోర్‌రెడ్డి

దొర్నిపాడు: వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్లు చంద్రబాబు, ఎమ్మెల్యే అఖిప్రియ అని వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మూలపెద్దమ్మ దర్శనం అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్త జాకీర్ ఇంట్లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే అఖిలప్రియ వెన్నుపోటు గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీలో గెలిచి టీడీపీలో చేరడాన్ని ఏమంటారో చెప్పాలని ప్రశ్నించారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఏడాది అయినా ఒక్కహామీని నెరవేర్చలేదని ఆ ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలంటూ పెద్దమ్మను వేడుకున్నట్లు చెప్పారు. అలాగే నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా వీరభద్రారెడ్డి, భూమా చెంచిరెడ్డి, కర్నాటి క్రిష్టారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, భూమా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాలాలయ వేడుకలు


ప్రత్యేక అలంకరణలో భీమలింగేశ్వరస్వామి


భీమలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని మూలమటంలో వెలసిన శ్రీ భీమలింగేశ్వర ఆలయ జీర్ణోద్ధారణ వేడుకలు రెండో రోజు ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాకారం ఖడ్గంతో ఆవాహనం, కుస్మాండ బలిదానం, మూల విగ్రహాలను కదిలించుట తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం బాలాలయంలోనికి మూలవిగ్రహాలను ఆవాహన చేసి కలశ స్థాపన చేశారు. తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఇషాక్ బాషా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వేణు నాద రెడ్డి మాట్లాడుతూ సీజీఎఫ్ నిధులతో ఈ ఆలయాన్ని పునః నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సన్నల వెంకటరామిరెడ్డి, బింగుమల్ల సుబ్బలక్ష్మయ్య, సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారికి పల్లకీ సేవ


స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేపట్టారు. దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

దేవీ మహత్యంపై ప్రవచనం


ప్రవచనం వినిపిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళా వేదికపై తెనాలికి చెందిన నోరి నారాయణమూర్తి దేవీమహత్యంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

శనగల బసవన్నకు విశేష పూజలు


శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీస్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు ఆదివారం అర్చకులు శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. శుద్ధ త్రయోదశి, బహుళ త్రయోదశి రోజుల్లో నందీశ్వరస్వామి పూజను భక్తులు పరోక్షంగా నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. ఆదివారం 17మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి పూజను జరిపించుకున్నారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజలలో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకలం పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తదనంతరం నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలు, ఫలోదకాలు, మల్లికాగుండంలోని శుద్ధ జలంతో అభిషేకం జరిపించారు. చివరగా.. నూతన వస్త్రసమర్పణ, విశేషార్చన, నానపెట్టిన శనగలను నైవేద్యంగా సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

రుద్రవరంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


నూతనంగా నిర్మించిన కాశీ ముక్కంటి ఈశ్వర దేవాలయం

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు కాశీ ముక్కంటి ఈశ్వర స్వామి దేవాలయ విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ నెల 10న ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, 11 న ఉదయం భక్తులు బందెలతో స్వామి వారికి నీళ్లు పోసే కార్యక్రమం, సాయంత్రం పూజలు ఉంటాయన్నారు. 12న ప్రభాత పూజ, ప్రతిష్ఠాంగహోమాదులు, తదుపరి యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, మూలా నక్షత్రయుక్త మిధున లగ్న శుభపుష్కరాంశములో యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠాపన, శివ పార్వతుల కళ్యాణము తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు ప్రతిష్ఠ మహోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

మండలంలోని రుద్రవరం గ్రామంలో కాశీముక్కంటి ఈశ్వరస్వామి దేవాలయల విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ (పురుషులు) పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు విజయ్, శివ ఆదివారం తెలిపారు. ఈ నెల 10 నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పోటీల్లో విజేతలకు వరుసగా ఐదు స్థానాల్లో..రూ.15,000, రూ. 10,000, రూ.5000, రూ.3,000, రూ. 2000ల చొప్పున నగదు అందజేస్తాన్నారు. పోటీల్లో పాల్గొనదలిచిన జట్టు 9వతేదీలోపు రూ. 300 ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 96428 82600 నెంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.


మహానందిలో పోలీసుల తనిఖీలు


మహానంది టోల్‌గేట్ వద్ద కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

మహానంది: దేవస్థానం పరిధిలోని గాజులపల్లె వైపు, నంద్యాల వైపు ఉన్న టోల్‌గేట్ల వద్ద ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బక్రీద్ పర్వదినం అనంతరం మరుసటి రోజైన ఆదివారం తనిఖీల్లో భాగంగా మద్యం, మాంసంతో పాటు మత్తు పదార్థాలు ఆలయ ప్రాంగణంలోకి రాకుండా పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ మౌలాలి, పోలీసు సిబ్బంది కిషోర్‌కుమార్, చంద్రశేఖర్ తనిఖీల్లో పాల్గొన్నారు. కాగా..ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో రోడ్ల వెంట చెట్లు పడిపోగా కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, శేషన్న ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో చెట్లను రోడ్డుకు అడ్డుగా లేకుండా తొలగించి సహాయ చర్యలు చేపట్టారు.

ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణం ప్రారంభం


వెంకాయపల్లె ఎల్లమ్మ


దాత రాజ్‌కుమార్

కర్నూలు కల్చరల్: మండల పరిధిలోని వెంకాయపల్లె గ్రామ సమీపంలో వెలసిన ఎల్లమ్మ దేవత ఆలయం పునర్నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. దేవదాయ శాఖ అనుమతులతో ప్రస్తుతం ఆలయం ఉన్న స్థానంలో రూ.2 కోట్లతో నూతన ఆలయ నిర్మాణం పనులు ప్రారంభించారు. ఆలయ పునర్నిర్మాణానికి తమిళ చిత్ర నిర్మాత రాజ్‌కుమార్ రూ.2 కోట్లు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెన్నై నగరంలో స్థిరపడిన తన తల్లి సొంత గ్రామం కర్నూలు సమీపంలోని నాగలాపురం అని తెలిపారు. చిన్నతనం నుంచి చెన్నై నుంచి అమ్మతో వచ్చి నాగలాపురం సుంకులమ్మ, వెంకాయపల్లె ఎల్లమ్మను దర్శించుకునేవారమని చెప్పారు. అమ్మవారు తమ ఇష్ట దైవమని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయం విశాలంగా ఉండాలనే ఉద్దేశంతో ఆలయ పునర్నిర్మాణానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈవో రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఆలయ పునర్నిర్మాణం దృష్ట్యా అమ్మవారి గర్భగుడిలో ఉన్న విగ్రహానికి శాంతి పూజలు, హోమాలు, నిర్వహించి యాగ మండపంలో పాల అమ్మవారిగా ఉంచడం జరిగిందన్నారు. భక్తులు యథావిధిగా అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించవచ్చన్నారు. సంవత్సరంలోగా ఆలయ నిర్మాణ పనులు పూర్తవుతాయని వెల్లడించారు.

ఊరంతా ఇంతే!

నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామంలో డ్రైనేజీ నిర్వహణ అధ్వానంగా తయారైంది. దీంతో ప్రధాన రహదారుల్లో మురుగునీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. డ్రైనేజీ వ్యవస్థలేకపోవడంతో ఇళ్లలోని మురుగునీరు సైతం రోడ్లపైకి వచ్చి చేరుతుండటంతో దోమలు బెడద పెరుగుతుంది. దీనికితోడు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతుండటంతో ఎక్కడ రోగాలు ప్రబలుతాయోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమ అంటూ హడావుడి చేసే అధికారులకు ఈ గ్రామంలో లోపించిన పారిశుధ్యం కనిపించకపోవడం గమనార్హం.

నంద్యాల(అర్బన్)


బీసీ కాలనీ ప్రధాన రోడ్డుపై కుంటను తలపిస్తున్న మురుగునీరు


అధ్వానంగా దర్గా సమీపంలోని రోడ్డు


మురుగునీటిలోనే నడుచుకుంటూ వస్తున్న వృద్ధురాలు